క్లుప్తంగా

పీచుబొమ్మలతో పర్యావరణ పరిరక్షణ


కొబ్బరి పీచుబొమ్మలను పరిశీలిస్తున్న విద్యార్థులు

మామిడికుదురు: మన ఉత్పత్తి, మన ఉపాధి, మన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పాశర్లపూడిలోని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొబ్బరి పీచుబొమ్మల యూనిట్‌ను శనివారం విద్యార్థులు సందర్శించారు. కొబ్బరిపీచుతో కళాత్మకమైన బొమ్మలను ఆవిష్కరిస్తున్న మహిళల నైపుణ్యాన్ని విద్యార్థులు మెచ్చుకున్నారు. పీచు బొమ్మలతో పర్యావరణానికి ఎటువంటి హాని కలగదని ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం చెప్పారు. పీచు బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా చేసుకుని ఎంతో మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు ఎస్.శశి పాల్గొన్నారు.

విజయలక్ష్మి సేవలు అభినందనీయం


మాజీ సర్పంచ్ విజయలక్ష్మి సంతాప సభలో పాల్గొన్న మాజీ మంత్రి వేణు

సఖినేటిపల్లి: మోరి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి జాన విజయలక్ష్మి అందించిన సేవలు అభినందనీయమని మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం మోరిలో నిర్వహించిన విజయలక్ష్మి సంతాప సభలో మాజీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. జాన శంకరరావు(బాబ్జీ), గుబ్బల మనోహర్, మంగెన వెంకట నరసింహారావు, ముప్పర్తి త్రిమూర్తులు, చింతా సుధాకర్‌రావు, పసలపూడి భగవాన్ శ్రీనివాస్, తాడి సహదేవ్, కారుపర్తి భాస్కరరావు, ఉప్పు సోమరాజు పాల్గొన్నారు.

జనార్దనుడికి లక్షతులసి పూజ


విశేష అలంకరణలో ఆలమూరు జనార్దనస్వామి

ఆలమూరు: ధనుర్మాసం పవిత్రతను పురస్కరించుకుని మండల కేంద్రమైన ఆలమూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో లక్షతులసి పూజ జరిగింది. ఆలయ అర్చకులు అంగర రంగాచార్యులు, అంగర భగవాన్ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే లక్షతులసి అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నవ జనార్దన ఆలయాల్లో నాలుగో ఆలయంగా భాసిల్లుతున్న స్థానిక జనార్దనస్వామి అభయముద్ర రూపంలో భక్తులను అనుగ్రహిస్తూ ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. నారద మహర్షి ప్రతిష్ఠితమైన ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకోవడానికి ధనుర్మాసంలో దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడం ఆనవాయితీగా వస్తుంది.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి కాకినాడకు చెందిన ఈమని నందన్ శనివారం రూ.10,116 అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది గ్రామస్తులు అభినందించారు.

ఆందోళనలు హాస్యాస్పదం

మామిడికుదురు: విద్యుత్ చార్జీలపై వైఎస్సార్ సీపీ ఆందోళనలు హాస్యాస్పదమని టీడీపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. పాశర్లపూడిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా రెండు హామీలు అమలు చేశామని, మిగిలిన నాలుగు హామీలను అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు.

పెంట కాలువలు


పంట కాలువలో వ్యర్థాలతో సగం వరకూ మూసుకుపోయిన వెదురుమూడి కాలువ


పినపళ్ల వద్ద గ్రామాభివృద్ధి నిధులతో కాలువల్లో చెత్త, చెదారాన్ని తొలగిస్తున్న రైతు కూలీలు (ఫైల్)

- మురికికూపంగా సాగునీటి వ్యవస్థ
- శివారు రైతులకు సాగునీటి ఇబ్బంది
- కలుషితమవుతున్న జలాలు

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ స్ఫూర్తికి విరుద్ధంగా అనేక చోట్ల అపారిశుధ్యం తాండవిస్తుంది. ఇరిగేషన్ శాఖల్లో పనిచేసే లస్కర్ల కొరత తీవ్రంగా వేధిస్తుండటంతో పంటకాలువలు డంపింగ్‌యార్డులుగా మారిపోతున్నాయి. పంటకాలువలపై సరైన పర్యవేక్షణ లేక, గ్రామీణ ప్రాంతాల్లో సరైన డంపింగ్‌యార్డుల సౌకర్యాలు లేక క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని అనేక మండలాల్లో ఉన్న గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తుంది. దీనికి తోడు పంట కాలువ వెంబడి నివసిస్తున్న ప్రజానీకం ఇష్టానుసారం వ్యర్థాలను అందులో పడవేయడం రైతులకు ప్రాణసంకటంగా మారింది. దీనికి తోడు కాలువగట్లను ఆక్రమించి నివాసాలు ఏర్పరచుకోవడం, ఇంట్లో వ్యర్థ జలాలను పైప్‌ల ద్వారా కాలువల్లోకి వదలడం తదితర చర్యల వల్ల సాగు నీరు జలాలు కలుషితమవుతున్నాయి. రబీ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో పంట కాలువలు వ్యర్థాలతో నిండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శివారు ప్రాంతాలకు సైతం తాగునీరు అందుతుంతో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

కాలువల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం పంట కాలువలు పరిరక్షించడానికి చర్యలు తీసుకోవడం ద్వారా నాణ్యమైన పంటలు పండించేందుకు వీలు కలుగుతుందని రైతులు చెబుతున్నారు. సాగు నీరు అందించవలసిన పంట కాలువలు కొందరి స్వార్థ ప్రయోజనాల వల్ల డంపింగ్ యార్డులుగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. పండుగలు, పర్వదినాలు, మాల ధారణ సమయంలో పుణ్యస్నానాలు ఆశ్రయించే భక్తులు పంటకాలువల దుస్థితి చూసి ఆవేదన చెందుతున్న పరిస్థితి నెలకొంది. అనేక గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ ద్వారానే కాకుండా అవకాశాన్ని బట్టి ఎన్ఆర్‌జీఈఎస్ నిధుల ద్వారా కాలువలకు మరమ్మతులు చేసుకుంటున్నా సరైన ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. రబీ సాగు ప్రారంభం కానున్న దృష్ట్యా ఇకనైనా ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి పంట కాలువలను ఆధునకరించాలని, వ్యర్థాలను కాలువల్లో పారవేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని పంట కాలువల్లోనూ అదే పరిస్థితి

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 11 మండలాలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, సెంట్రల్ డెల్టా కాలువల ద్వారా సాగు నీరు విడుదల అవుతుంది. ఆ నీరు ఉప కాలువ, పిల్ల కాలువల ద్వారా సుమారు 60 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ నీరు పారే క్రమంలో కాలువ వెంబడి ఉన్న గ్రామాలు, నివాసాల నుంచి చెత్త, చెదారం ఆ కాలువల్లోనే పడేస్తున్నారు. దీని వల్ల అందులో ఉండే వ్యర్థ పదార్థాల వల్ల డ్యామ్‌లు, తూముల వద్ద ఆగిపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని కాలువల్లోనూ అదే పరిస్థితి నెలకొనడం వల్ల రెండు పంటలకు అవసరమయ్యే సాగునీరు పుష్కలంగా ఉన్నా వ్యర్థాల వల్ల మోటారు బోర్లను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మురుగు కాలువలను వినియోగించుకునేందుకు చర్యలు

నియోజకవర్గంలోని పలు మండలాల్లో మురుగు కాలువలు అందుబాటులో ఉన్నా గ్రామీణ వాసులు వినియోగించుకోలేని పరిస్థితి ఇప్పటి వరకూ లేకుండా పోయింది. ఇటీవల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బారీగా నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీల ఏర్పాటుకు మార్గం సుగమమయింది. దీనికి తోడు గ్రామాలకు సుదూరంగా ఉన్న మురుగుకాలువలకు గ్రామాల్లోని మురుగు నీటిని అనుసంధానం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే స్వచ్ఛ సంకల్ప గ్రామాల కోరిక నెరవేరే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది..

వ్యర్థాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం

పంట కాలువల్లో వ్యర్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తాం. గ్రామ సచివాలయాల ద్వారా ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛ సంకల్ప వాహనాలను డంపింగ్‌యార్డులకు తీసుకువెళ్లే విధంగా చర్యలు చేపడతాము.

– ఎ.రాజు, ఈఓపీఆర్డీ, ఆలమూరు

మెయింటెనెన్స్ నిధులతో శుభ్రపరుస్తాం

పంట కాలువలు తెరచే లోపు ప్రభుత్వ సమకూర్చనున్న మెయింటెనెన్స్ నిధుల నుంచి ఆధునీకరిస్తాం. కాలువల్లో వ్యర్థాలు వేయకూడదన్న భావన ప్రతి ఒక్కరిలో కలగాలి. తద్వారా రైతులు మెరుగైన, నాణ్యమై పంటలు పండించే వీలు కలుగుతుంది.

– టి.కృష్ణత్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

ఏడు చానళ్ల అభివృద్ధి పనులు ప్రారంభం


ఈదరాడ చానల్ అభివృద్ధి పనుల్ని పరిశీలిస్తున్న నీటి సంఘం ప్రతినిధులు

మామిడికుదురు: తాటిపాక నీటి సంఘం పరిధిలోని ఏడు చానళ్ల అభివృద్ధి పనులను శనివారం చేపట్టారు. దాళ్వా పంటకు సాగునీటి సమస్య లేకుండా కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఈదరాడ పంట కాలువ అభివృద్ధి పనులు ప్రారంభించారు.

తాటిపాక నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కడలి కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు చిత్రపు కన్నన్ కుమార్, కూటమి నేతలు పనులను పర్యవేక్షించారు. తాటిపాక ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్ పనులను పర్యవేక్షించారు. మామిడికుదురు మండలంలోని ఏడు చానళ్లను ఈ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. పంట కాలువ పలుచోట్ల కోతకు గురవుతున్న విషయాన్ని రైతులు నీటి సంఘం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తులు



బి.సావరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో దశాబ్దాల నుంచి శాశ్వతంగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న తమకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు 20 మంది రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేశారు. గ్రామ పంచాయతీ వద్ద శనివారం తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఏటిగట్టు పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో దశాబ్దాల నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని స్థానికులు పేర్కొన్నారు. వారికి ప్రభుత్వ రుణాలు మంజూరు కొరకు పట్టాలు మంజూరు చేయాలని ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య కోరారు. రెవెన్యూ సదస్సు ఉద్దేశాన్ని వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు. పలు శాఖలకు చెందిన ఉద్యోగులు సదస్సులో పాల్గొన్నారు.


పెదపట్నంలంక సదస్సులో పట్టాలు కోరుతూ దరఖాస్తు ఇస్తున్న ఆక్రమణదారులు

రాజోలులో..

రాజోలు: రెవెన్యూ సదస్సులో ప్రభుత్వ పథకాల మంజూరు కోరుతూ చేసుకున్న దరఖాస్తులను స్వీకరిస్తున్నామని డీఎల్‌పీఓ బుచ్చిరాజు అన్నారు. శనివారం బి.సావరంలో సర్పంచ్ కడియం రమాదేవి అధ్యక్షతన జరిగింది. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రైస్ కార్డుల కోసం 53, పింఛన్ల కోసం 73, ఇంటి స్థలాల కోసం 28 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎం.కృష్ణ, పార్టీ నాయకులు జగడం సత్యనారాయణ, కడియం పూర్ణచంద్రరావు, రావూరి నాగబాబు, కుంపట్ల చిన్నారి, మట్టపర్తి అబ్బులు, తిక్కిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి తాము, రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. శనివారం మాగం, క్రాప, శంకరాయగూడెంలో గ్రామాల్లో గ్రామ సర్పంచులు కాశి సత్యనారాయణ, బొబ్బిలి సీతాదేవి, బొక్కా కామేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుకు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ వేదికను గ్రామస్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. మాగం ఎనిమిది, క్రాప, శంకరాయగూడెం మూడు అర్జీలు అందాయన్నారు. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీటీసీ గుత్తుల శ్రీరామ్మూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ గోపీనాథ్‌కు పుస్తకం అందజేత


ఆలమూరోళ్ల కథలు పుస్తకాన్ని తమిళనాడు ఎంపీకి అందజేస్తున్న రచయిత శ్రీనివాసు

ఆలమూరు: గ్రామానికి చెందిన యువ రచయిత గొడవర్తి శ్రీనివాసుకు అరుదైన గౌరవం దక్కింది. ప్రస్తుతం కృష్ణా జిల్లాలోని విజయవాడలో జరుగుతున్న ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభ నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది. అందులో భాగంగా గొడవర్తి శ్రీనివాస్ శనివారం ఆ ప్రపంచ తెలుగు మహాసభలో పాల్గొన్నారు. ఆ మహాసభలకు అతిథిగా విచ్చేసిన తమిళనాడులోని కృష్ణగిరి ఎంపీ కె.గోపీనాథ్‌ను కలసి తాను రచించిన ×ఆలమూరోళ్ళ కథల్లు పుస్తకాన్ని అందజేశారు. దీంతో పాటు సభకు విచ్చేసిన పలువురు ప్రముఖ రచయితలకు ఆలమూరోళ్ల కథలు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసును పలువురు అభినందించారు.

ఎంపీడీవోపై దాడి అప్రజాస్వామికం


కొత్తపేటలో నిరసన తెలుపుతున్న ఎంపీడీవో నరేష్‌కుమార్ తదితరులు

అంబాజీపేట: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై జరిగిన దాడి అప్రజాస్వామికమని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. రాష్ట్ర ఏపీపీఆర్ గెజిటెడ్ ఆఫీసర్స్, మినిస్ట్రియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు జవహర్ బాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఎంపీడీఓపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు ఉండేలా చూడలన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడిపై కొత్తపేటలో మండల పరిషత్ అధికారులు సిబ్బంది నిరసన తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో పీఎస్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది దాడిని తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ఎంపీడీవో నరేష్ కుమార్ మాట్లాడుతూ ఎంపీడీవోపై దాడి చేయడం హేయమని నిందితులపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. డీసీఎం పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి, బాధితుల్ని పరామర్శించి, నిందితులపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరులోని ప్రధాన బ్యాంకులు, కార్యాలయాలు

కార్యాలయం/బ్యాంకు పేరు	గ్రామం	ఎస్‌టీడీ కోడ్	ఫోన్ నంబర్
పోలీసు స్టేషన్	(ఆలమూరు)	08855	278433
సబ్ రిజిస్ట్రార్	(ఆలమూరు)	08855	278235
సబ్ ట్రెజరీ	(ఆలమూరు)	08855	278418
వ్యవసాయ మార్కెట్ కమిటీ	(ఆలమూరు)	08855	278298
యాక్సిస్ బ్యాంక్	(ఆలమూరు)	08855	279433
యూనియన్ బ్యాంక్	(ఆలమూరు)	08855	278448
ఇండియన్ బ్యాంక్	(ఆలమూరు)	08855	278440
డీసీసీబీ బ్యాంక్ (బ్రాంచి)	(ఆలమూరు)	08855	278591
బ్యాంక్ ఆఫ్ బరోడా	(పెదపళ్ల)	08855	278583
యూనియన్ బ్యాంక్	(జొన్నాడ)	08855	279545
గోదావరి గ్రామీణ బ్యాంక్	(పెదపళ్ల)	08855	294703
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	(మడికి)	0883	2493272
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	(చెముడులంక)	0883	2493560
గోదావరి గ్రామీణ బ్యాంక్	(నర్సిపూడి)	0883	2493510
గోదావరి గ్రామీణ బ్యాంక్	(చొప్పెల్ల)	0883	2493113

మాజీ ప్రధానికి నివాళి

అంబాజీపేట: దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి మండల అఖిలపక్ష నాయకులు శనివారం స్థానిక బస్‌స్టేషన్ వద్ద అఖిలపక్ష నాయకులు పాల్గొని నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్‌లు అమలు చేసిన నూతన ఆర్థిక సరళీకృత విధానాల వల్లే అప్పటి భారతదేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభ సమయం నుంచి గట్టెక్కించిన మహోన్నత వ్యక్తులుగా పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రావులపాలెం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రావులపాడు రోడ్డు జయశ్రీ ఆస్పత్రి బిల్డింగ్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సాయిరాం హాస్పిటల్ వైద్య సిబ్బంది వైద్యసేవలను అందించారు. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కర్రి సుబ్బారెడ్డి, సెక్రటరీ చిర్ల కనికిరెడ్డి, ట్రెజరర్ కర్రి రామచంద్రారెడ్డి తదితరులు ప్రారంభించారు.

మందపల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


మందపల్లి శనైశ్చరాలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేశారు. శనికి ప్రీతికరమైన శనివారంతో పాటు ఈసారి అమావాస్య ముందు త్రయోదశి పర్వదినం కలసి రావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం వెనుకషెడ్లలో పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ సల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్ష పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి ప్రత్యక్ష పరోక్ష టికెట్ల రూపంలో రూ.27,53,720, అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.5,89,400తో మొత్తం రూ.33,85,938 ఉదయం వచ్చిందని డీసీ అండ్ ఈవో చక్రధర్ రావు తెలిపారు. ఇదిలా ఉంటే, పలువురు ప్రముఖులు స్వామికి పూజలు చేశారు.

దేవదాయ శాఖ కమిషనర్ ప్రత్యేక పూజలు

శని త్రయోదశి పర్వదినం సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ త్రయోదశి సందర్భంగా తైలాభిషేకం నిర్వహించుకుని, శ్రీస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం కమిషనర్ 7 ఏళ్లకు గాను ప్రతి శనివారం పరోక్షంగా తైలాభిషేకాల నిమిత్తం రూ.1,45,600 చెల్లించారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రమాదేవి

మలికిపురం: కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చాలా ముఖ్యమని రాజోలు ఐసీడీసీ సీడీపీఓ వైకేడీ రమాదేవి పేర్కొన్నారు. శనివారం మలికిపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. వాటిని సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఐసీడీఎస్‌పై ఉందని ఆమె అన్నారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎస్సై పీవీవీ సురేష్, ఎంఈఓ ఎం.విజయశ్రీ, చైల్డ్ ప్రొటక్షన్ జిల్లా అధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మునీశ్వరమ్మ మృతి బాధాకరం


మునీశ్వరమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేసి పేదలకు విశేష సేవలు అందించిన చల్లా మునీశ్వరమ్మ (80) మృతి వ్యక్తిగతంగా తమకు తీరని లోటని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని పసుపులేటి వారి వీధిలోని ఆమె నివాసానికి శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వెళ్లారు. మృతురాలు మునీశ్వరమ్మ కుమారులైన వ్యాపార వేత్త, డాక్టర్ చల్లా ప్రభాకరరావు, చల్లా నానాజీ, చల్లా భూషణంను పరామర్శించారు. తల్లి మునీశ్వరమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి సంతాపాన్ని తెలియజేసారు. అనంతరం మునీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆస్పత్రి అభివృద్ధికి ఆమె సొంత నిధులను సైతం వెచ్చించి అప్పటి ప్రభుత్వ సహకారంతో చేపట్టిన సేవా, సామాజిక కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్మరించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

రావులపాలెం: మండలంలో ఇటీవల మృతి చెందిన ఇరువురి మాజీ సర్పంచుల కుటుంబాలను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఇటీవల మృతి చెందిన గోపాలపురం మాజీ సర్పంచ్ సబ్బితి డేవిడ్‌రాజు, వెదిరేశ్వరం మాజీ సర్పంచ్ కాశీ నాగేశ్వరరావు కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

వణికిస్తున్న చలి


అంబాజీపేట మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మఫ్లర్లు

అంబాజీపేట: నాలుగు రెండు వారాలుగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి పెరిగి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఉదయం 10 గంటల వరకూ చలిగాలులు వీస్తూనే ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు చలితో నానాఅవస్థలు పడుతున్నారు. చలి నుంచి రక్షించుకునేందుకు మార్కెట్‌లో వివిధ రకాల మంకీ క్యాప్‌లు, మఫ్లర్ వంటి ఉన్ని దుస్తులను వినియోగిస్తున్నారు. ఈ ఏడాది చలిగాలులు ఎక్కువగా వీస్తున్నాయని పలువురు చెబుతున్నారు.

శంఖారావం సభ పోస్టర్ల ఆవిష్కరణ

మామిడికుదురు: విజయవాడలో జనవరి 5న జరిగే హిందూ శంఖారావం సభను విజయవంతం చేయాలని సర్పంచ్ అడబాల తాతకాపు పిలుపునిచ్చారు. లూటుకుర్రు గ్రామంలో శనివారం హిందూ శంఖారావం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. దేవాలయాల పరిరక్షణ లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ జరుగుతుందన్నారు. హిందువులంతా కార్యక్రమానికి తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలి

అంబాజీపేట: యూటీఎఫ్ సంఘం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభ సంబరాలను వచ్చే నెల 5 నుంచి 8 వరకు కాకినాడ పీఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరుగుతాయని జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జీవీ రమణ తెలిపారు. అంబాజీపేటలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అధ్యక్షతన స్వర్ణోత్సవ మహాసభ సంబరాల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ మహాసభ సంబరాలకు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పీవీ విశ్వప్రసాద్, గౌరవ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, మహిళా కార్యదర్శి సీహెచ్ శ్యామలకుమారి, జి.రాంబాబు, పి.నారాయణమూర్తి, బీఆర్ఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.